ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబర్ 2023
5
విజయనగరం

అంగన్వాడీల సమ్మె 12కు వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యల పరిష్కారానికి ఈనెల 8న తలపెట్టిన అంగన్‌వాడీల సమ్మె ఈనెల 12కు వాయిదా పడినట్లు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, అధ్యక్షులు బి.పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను వల్ల రాష్ట్రంలో ఎక్కువ జిల్లాల్లో తుపాను ప్రభావం వల్ల ప్రజలు కష్టాల్లో ఉన్నారని, వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయిందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు సైతం నీట మునిగాయన్నారు. ప్రభుత్వం సహాయ కార్యక్రమాలు అంగన్వాడీ కేంద్రాల్లో భోజనాలు, వసతులు ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఈనెల 6న శిశు సంక్షేమశాఖా మంత్రితో జరపాల్సిన చర్చలు వర్షాలు కారణంగా వాయిదా పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో సమ్మెను 12 తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

మిచౌంగ్ తుపాను రూపంలో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు జిల్లాలో అపార పంటనష్టం వాటిల్లింది. ముఖ్యంగా వరి, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. పత్తిచేలు దెబ్బతిన్నాయి. మినుములు, పెసలు వంటి అపరాలు కూడా నీటిలో ఊరిపోతున్నాయి. గాలులకు జిల్లాలో అక్కడక్కడ ఉన్న బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. వందలాది ఎకరాల్లో వరి పొలాల్లోనే ఉండిపోయింది.

కోలుకోలేని దెబ్బ

- ఇంకా జలదిగ్బంధంలోనే వరిచేలు
- రంగుమారే అవకాశం
- నీటిలో ఊరిపోతున్న మినుము, పెసర మొక్కలు
- కొలిక్కిరాని అధికారుల అంచనాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్ని పంటలూ కలుపుకుని 2,83,912 ఎకరాల్లో సాగవ్వగా, అత్యధికంగా వరి 2,34,437 ఎకరాల్లో సాగైంది. ఇందులో సుమారు 1.53లక్షల ఎకరాల్లో వరికోతలు పూర్తైయినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో చాలా వరకు ఇంకా పొలాల్లోనే ఉంది. పంటపొలాలు జలమయం కావడంతో కొన్ని చోట్ల వరి దిబ్బలు, వోవులు కూడా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కల్లాలకు చేరిన పంటలో కొంత నూర్పుకాగా, మరికొంత నూర్పుచేసేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు. ఇటువంటి సమయంలో వచ్చిన తుపాను నాలుగు రోజులుగా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. భోగాపురం మండలంలో 386 ఎకరాలు వరి నీటమునిగింది. మరో 224 ఎకరాల్లో వరి గాలి, ఎన్ను బరువెక్కడంతో పూర్తిగా నేలకొరిగింది. చీపురుపల్లి మండలంలో 125 ఎకరాలు నీట మునిగి పోయింది. గుర్ల మండలంలో 600 ఎకరాల్లో పంటనష్టం ఉంటుందని అంచనా. రేగిడి మండల వ్యాప్తంగా సుమారు 2,700 ఎకరాలు, నెల్లిమర్లలో 450 ఎకరాల మేర అతివృష్టి వెంటాడింది. మెరకముడిదాం, తెర్లాం మండల్లాల్లో 20 ఎకరాల చొప్పున, బాడంగిలో 14 ఎకరాలు చొప్పున నష్టం జరిగినట్టు ఇప్పటి వరకు ఉన్న అంచనా. ఇది పెరిగే అవకాశం ఉంది. ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో, చేతికి అందినపంట వర్షార్పణ అయిపోతోందంటూ రైతులు కంటతడి పెడుతున్నారు. ముఖ్యంగా

చొల్లంగిపేటలో నీటిలో ఉండిపోయిన వరిచేను పరిశీలిస్తున్న రైతు

వరి దిబ్బలు, గట్లపై వేసిన ఓవులు ఇప్పటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కలాల్లోని ధాన్యం కూడా తడిసి ముద్దవ్వడంతో మొలకెత్తడం, రంగు మారిపోవడం వంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటువంటి వాటిని ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే అప్పుల్లో కూరుకుపోవడమేనంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న సుమారు 5,271 ఎకకరాల్లో సాగైంది. అంతా 30 నుంచి 40రోజుల ఏపు దశలోవుంది.ఈ సమయంలో చేనులో నీరు నిల్వవుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు బయటకు పోయేందుకు అవకాశం లేనిచోట ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడనున్నాయి. వర్షాలు కొనసాగితే ఆ పంట కూడా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఇటు రైతులు, అటు అధికారులు చెబుతున్నారు. పత్తి జిల్లా వ్యాప్తంగా 4364 ఎకరాల్లో సాగవ్వగా సుమారు 2వేల ఎకరాల్లో ఇంకా మూడో దశ ఏరివేత చేపట్టాల్సివుంది. ఏరివేతకు సిద్ధంగావున్న పత్తి అంతా నాలుగు రోజులుగా వర్షపునీటికి నానుతూ బరువెక్కింది. వర్షాలు కొనసాగితే మొక్కలు నేలకొరిగే ప్రమాదం కనిపిస్తోంది. మినుములు, పెసలు వంటి అపరాలు వేసిన మడుల్లోనూ నాలుగు రోజులుగా నీరు నిల్వవుండిపోవడంతో మొలకొత్తే పరిస్థితి లేదు. ఇప్పటికే నాటిన మెలకలు, మొక్కలు నీటిలో ఊరిపోతున్నాయి. మెరకముడిదాం మండలంలో 45 ఎకరాల్లోనూ, చీపురుపల్లిలో 75ఎకరాల్లోనూ నష్టం వాటిల్లింది. మరోవైపు పంట నష్టాలపై అధికారుల లెక్కలు కొలిక్కిరాలేదు. పంటనష్టం నాలుగు రోజులుగా జరుగుతున్నా క్షేత్ర స్థాయి పరిస్థితులపై ప్రాథమిక అంచనా కూడా రూపొందించక పోవడం గమనార్హం. దీన్నిబట్టి ఆర్‌బికె, సచివాలయ వ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో చెప్పుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పంటనష్టాన్ని 9వ తేదీ నుంచి అంచనా వేస్తామంటూ జిల్లా కలెక్టర్ ప్రకటించడంతో వ్యవసాయ, ఉద్యానశాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రాథమిక అంచనాలు పంపడంలోనూ ఆలసత్వం ప్రదర్శిస్తున్నట్టుగా స్పష్టమౌతోంది.

అంచనాలు వేస్తున్నాం

ఇంకా ప్రాథమిక అంచనాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అంచనాలు కొలిక్కివచ్చే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ సిబ్బంది అంతా ఇదే పనిలోవున్నాం. వరి పంట నష్టమే ఎక్కువగా జరిగింది. మిగిలిన పంటలు కొంతమేర పర్వాలేదు.

విటి రామారావు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

చొల్లంగిపేటలో తడిచిపోయిన వరిచేనును జెడ్‌పి చైర్మన్‌కు చూపిస్తున్న రైతు

రైతులకు అండగా ఉంటాం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-డెంకాడ, గుర్ల, గరివిడి, చీపురుపల్లి

పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సబ్సిడీపై మినుము విత్తనాలను కూడా అందించనున్నట్లు తెలిపారు. మిచౌంగ్ తుపాను కారణంగా గుర్ల మండలం గుర్ల గ్రామం, గరివిడి మండలం శివరాం, చీపురుపల్లి మండలం పేరిపి గ్రామంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను చైర్మన్ పరిశీలించారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పల నాయుడుతో కలిసి ముందుగా డెంకాడ మండలం చొల్లంగిపేట గ్రామంలో పర్యటించి, దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంట దెబ్బతిన్న రైతాంగానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికార బృందాలు ప్రతీ గ్రామంలో పర్యటించి, పంట నష్టం వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు., రైతులకు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రయోజనాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు జిల్లాలో కొన్నిచోట్ల మినుము పంట కూడా నీట మునిగి దెబ్బతిన్నదనీ, ఆదుకోవాలని రైతులు కోరగా, సబ్సిడీపై మినుము విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశిస్తూ, పేరిపి గ్రామంలో రైతులకు ట్రక్ షీట్లను అందజేశారు. పర్యటనలో జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, అధికారులు పాల్గొన్నారు.

తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి

రైతుల నుంచి తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జెడ్‌పి చైర్మన్ కోరారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులతో సమావేశమై చర్చించారు.

అసైన్డ్ భూములపై శాశ్వత హక్కులు

అర్హత ఉన్న వాటిని 22ఎ జాబితా నుంచి తొలగించాలి : జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసైన్డ్ భూములపై శాశ్వత యాజమాన్య హక్కులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. అసైన్డ్ భూములకు హక్కుల కేటాయింపు, ఈ ప్రక్రియలో తిరస్కరణకు గురైన అంశాలపై తాహశీల్దార్లకు, డిప్యూటీ తాహశీల్దార్లకు గురువారం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. తిరస్కరించిన భూములపై మండలాల వారీగా జెసి సమీక్షించి కారణాలను తెలుసుకున్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివిధ అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, అసైన్డ్ భూములను 22 ఎ జాబితా నుంచి తొలగించి, వాటిపై శాశ్వత యాజమాన్య హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం ఇటీవల నిర్ధేశించిన అంశాలను వివరించారు. 2003 సంవత్సరం కంటే ముందు ఇచ్చిన భూములకు మాత్రమే ఈ ఆదేశాలు వర్తిస్తాయని జెసి చెప్పారు. ఆ భూమి ఖచ్చితంగా అసైన్డ్ అయి ఉండాలని, లబ్దిదారుని యాజమాన్యంలోనే ఆ భూమి ఉండి ఉండాలని, 22 ఎజాబితాలో ఉన్న భూములకు

సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

మాత్రమే ప్రభుత్వం జారీ చేసిన జిఒ వర్తిస్తుందని జెసి స్పష్టం చేశారు. వెబ్‌ల్యాండ్, పిఒఎల్‌ఆర్ లాంటి ఏదో ఒక రెవెన్యూ రికార్డుల్లో రైతు పేరు ఉన్నా సరిపోతుందని చెప్పారు. ఒకే సర్వే నంబరులో వేర్వేరు వ్యక్తులకు అసైన్డ్ చేసి ఉన్నట్లయితే, ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వారికి సబ్‌డివిజన్ చేసి, వారి భూమికి హక్కులు కల్పించాలని, 22ఎ జాబితానుంచి తొలగించాలని ఆదేశించారు. డికెటి పట్టాలే కాకుండా, ప్రొవిజనల్ పట్టాలను సైతం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అర్హత ఉన్నవారికి వారి భూములపై శాశ్వత హక్కులు కల్పించి ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా నిబంధనలను పాటిస్తూ రైతులకు మేలు చేకూర్చాలని జెసి కోరారు. వర్క్‌షాపులో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం లేఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో మిచౌంగ్ తుపాను వల్ల రబీ పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వెంటనే ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు కోరారు. ఈమేరకు కలెక్టర్‌కు లేఖ రాశారు. జిల్లాలో తుపాను కారణంగా వరి, అపరాలు, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, అధికారులు ఉచితంగా విత్తనాలు అందించి ఆదుకోవటానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తడిసిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు నిబంధనలు సడలించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. నష్ట పోయిన పంటలను గుర్తించి కౌలు రైతులకు, కౌలు రైతులకు పరిహారం ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు చొప్పున ఇవ్వాలని కోరారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం

విజయనగరం కోట : తల్లిదండ్రులు లేని అనాథ మహిళకు ఆదర్శ వివాహం జరిపించి, కొత్త జీవితాన్ని ఇచ్చింది జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ. స్వధార్ హోంలో ఆశ్రయం పొందుతున్న పెదనాపు మంగమ్మకు, గొట్లాం గ్రామానికి చెందిన కింతల గణేష్‌తో స్థానిక ఎంఆర్ కళాశాల సమీపంలోని సీతారాముల కోవెలలో గురువారం ఉదయం ఆదర్శ వివాహం జరిపించారు.

సాయుధ దళాల సంక్షేమ నిధికి విరాళాలివ్వండి

కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సైనికుల త్యాగాల ఫలితంగానే దేశంలో ప్రజలంతా ప్రశాంతంగా ఉండగలుగుతున్నారని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. వారు ఎండనకా, వాననకా ఎన్నో కష్టాలకోర్చి సరిహద్దుల్లో రాత్రీపగలూ పహారా కాస్తూ, మన దేశాన్ని రక్షిస్తున్నారని కొనియాడారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా, సైనికుల సంక్షేమం కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వద్ద కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ప్రారంభించారు. పతాకనిధి జెండాను అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ రక్షణలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. సైనిక దళాలు చూపించే మొక్కవోని దీక్ష, త్యాగం, దేశభక్తి, సాహసాల పట్ల దేశం ఎల్లప్పుడూ గర్వపడుతోందని పేర్కొన్నారు. సాహసోపేత వీర జవాన్లకు వందనం సమర్పించి, వారి కుటుంబాలకు కాస్తయినా చేదోడుగా నిలిచేందుకు డిసెంబరు 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా సాయుధ దళాల సంక్షేమ నిధికి విరాళాలను సేకరించి, సైనికుల సంక్షేమం కోసం ఖర్చు చేస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా విరాళాల సేకరణ ప్రారంభిస్తున్నామని, ఎన్‌సిసి కేడెట్లు తమ వద్దకు వచ్చినప్పుడు, ప్రజలు పెద్ద ఎత్తున విరాళాలు ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

జిల్లా సైనిక సంక్షేమాధికారి కృష్ణారావు మాట్లాడుతూ, సాయుధ దళాల సంక్షేమ నిధికి దాదాపు నెలరోజులపాటు దేశ వ్యాప్తంగా విరాళాలను

విరాళాలు సేకరిస్తున్న కలెక్టర్

సేకరించడం జరుగుతుందని చెప్పారు. తమ వద్దకు వచ్చే ఎన్‌సిసి కేడెట్లకు నగదు రూపంలో విరాళాలు ఇవ్వవచ్చునని, లేదా జిల్లా సైనిక సంక్షేమాధికారి, విజయనగరం పేరుమీద చెక్కులను లేదా స్టేట్‌బ్యాంకు ఖాతా నెంబరు 52065221666, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0020931లో నేరుగా జమ చేయవచ్చునని సూచించారు. గరివిడి ఫేకర్ యాజమాన్యం విరాళంగా ఇచ్చిన రూ.11వేల చెక్కును ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్.ఎన్.మూర్తి ఈ సందర్భంగా కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు, ఎన్‌సిసి బాలికల బెటాలియన్ నుంచి కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, ఇంకా సబ్. సి.హుస్సేనయ్య తదితరులతోపాటు సైనిక సంక్షేమ సంఘాల నాయకులు, మాజీ సైనికులు, ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు.

క్యాబేజీ రైతు కుదేలు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఆరుగాలం కష్టించి సాగుచేసి పంట చేతికి అందివచ్చే తరుణంలో తుపాను ప్రభావం వల్ల క్యాబేజీ రైతులు కుదేలయ్యారు. మండల కేంద్రం వీరఘట్టంతోపాటు బూరుగ, కొట్టుగుమ్మడ , నడుకూరు, చిదిమి తదితర గ్రామాల్లో సుమారు 350 మంది కూరగాయల రైతులు 450 ఎకరాల్లో క్యాబేజీ పంట సాగు చేశారు. విత్తనాలు, ఎరువులు, కూలీలు, తదితర ఖర్చులు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 3 నుండి వర్షాలు పడకపోవడంతో పంట దిగుబడి అధికంగా లేనప్పటికీ బహిరంగ మార్కెట్లో ధర కూడా లేదని కూరగాయల రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో 10 కిలోల క్యాబేజీ పువ్వు రూ.300 పలికేదని, ప్రస్తుతం రూ.150 కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన పంట భువనేశ్వర్, విశాఖపట్నం, సిరిపురం, శ్రీకాకుళం, పార్వతీపురం, తదితర ప్రాంతాలకు తరలించి విక్రయాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం తుపాను ప్రభావం వల్ల క్యాబేజీ పువ్వు చెమ్మచెరి, పురుగు పట్టి కుళ్లిపోవడం వల్ల తీవ్రంగా పంట నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

యువ సంగం ఫేజ్ 3 ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర ప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం అద్భుతమైన సాంస్కృతిక మార్పిడి కార్యక్రమానికి నాంది పలికింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన యువ సంఘం మూడో విడత కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నుంచి ఇద్దరు చొప్పున 48 మంది విద్యార్థులు, నలుగురు అధ్యాపకుల బృందం న్యూఢిల్లీకి వెళ్తున్నారు. ఈ బృందం వెళ్తున్న వాహనాన్ని డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్ర స్వామి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి జండా ఊపి ప్రారంభించారు. యువత దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి దేశ సంస్కృతి సంప్రదాయాలు, సాంకేతిక ఆవిష్కరణలను చూసేందుకు యువసంగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు టి.వి. కట్టిమణి తెలిపారు. తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం భీంపోలు సమీపంలోని ఊవ్వాగెడ్డలో కొట్టుకుపోయిన ముగ్గురు సీతపాడు గ్రామంలోని గిరిజనులు మిరియాల కమల, గెమ్మెల లక్ష్మి, కుమార్ కుటుంబాలను ఎస్.టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు శుక్రవారం పరామర్శించారు. ఈ సంఘటన చాలా బాధాకరమని, వరదల సమయంలో ఎవరూ ఇలాంటి గెడ్డలను దాటే సాహసాలు చేయవద్దని అన్నారు. నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-చీపురుపల్లి

జిల్లాలో తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని విజయనగరం పార్లమెంట్ స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున డిమాండ్ చేశారు. మండలంలోని పుర్రేయవలస, రామలింగాపురం గ్రామలలో తుపాను వలన నష్టపోయిన పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తుపాను ప్రభావంతో వరి, మొక్కజొన్న, ఇతర పంటలు తీవ్రంగా నష్టపోయాయి అన్నారు. వరి పంట చేతికి వచ్చిన సమయంలో తుపాను ప్రభావానికి వరి పంట తడిసిపోయిందని, మొక్క జొన్న పంట గాలులకు నెలకొరింగి నష్ట పోయిన పంటను వెంటనే అధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని నాగార్జున

చిల్లపేటలో నీట మునిగిన వరిచేలను టిడిపి నాయకులకు చూపిస్తున్న రైతులు

నేలకొరిగిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న కిమిడి నాగార్జున తదితరులు

డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామునాయుడు, పుర్రేయవలస సర్పంచ్ సారిక మోహన రావు, బేవర పురుషోత్తం నాయుడు, అరతి సాహు, సబ్బి సోనియా, మీసాల కాశీ, గడే సన్యాసప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : విజయనగరం మండలం దుప్పాడ, చిల్లపేట గ్రామాల్లో నీట మునిగిన వరిచేలను టిడిపి మండల కార్యదర్శి గంటా పోలినాయుడు, చిల్లపేట సర్పంచ్ కోదండరాం, నడుపూరు రాంబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఏడాది కష్టం నీటిపాలైందని కన్నీరు పెట్టారు. ఈ సందర్భంగా నాయకులు రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన సబ్ జూనియర్ క్యాడెట్ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. గ్రూప్ విభాగం- సిల్వర్ మెడల్ కుశాల్, పునీత్, సాత్విక్, పెయిర్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సంకీర్తన, కుశాల్ గుణదీప్, క్యారుగీ విభాగంలో కె . సాహిత్య - సిల్వర్ మెడల్ , వి దేవన్ మణికంఠ - బ్రాంజ్ మెడల్, చరిష్మా - బ్రాంజ్ మెడల్‌బి కైవసం చేసుకున్నారు. జిల్లాకు చేరుకున్న వీరికి రైల్వేస్టేషన్‌లో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు స్వాగతం పలికారు.

పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు

సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత నెల 15న జెఎన్‌టియు జివి అనుబంధ కళాశాల అయిన జిఎంఆర్ ఐటి (రాజాం), విజయనగరం కళాశాల మైదానంలో జరిగిన సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటి వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్లు నిర్వహించారు. ఇందులో భాగంగా బి. ప్రశాంత్ (విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), ఎం. భార్గవ రాజు గుప్త (గొన్నా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), ఐ. సతీష్ (ఐతం కాలేజ్, టెక్కలి),ఎ. వినయ్ కుమార్ (డైట్ కాలేజ్, అనకాపల్లి), కె. మౌనీష్ (జిఎంఆర్ ఐటి, రాజాం) పూజిత (ఐతం, టెక్కలి) వై. ప్రజ్ఞా కుమారీలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆది కవి నన్నయ యూనివర్సిటీ రాజమండ్రి లో జరగబోతున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని జె.ఎన్.టి.యు. జి వి ఉపకులపతి ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయసుమ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎవి పాపారావు , ఫిజికల్ డైరెక్టర్స్ కె.నాగరాజు , ఎమ్. ఎల్లారీశ్వరి తెలిపారు.

'మళ్లీ జగనే ఎందుకు కావాలి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం 35, 40 డివిజన్లలో జరిగాయి. వైసిపి జోనల్ ఇన్చార్జి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు. సచివాలయాలలో లబ్ధిదారుల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైసిపి పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా బంగారు నాయుడు, కార్పొరేటర్లు ధనలక్ష్మి, చందక శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల చెంతకే అందిస్తూ సుపరిపాలనకు నాంది పలికారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపిస్తే మరింత మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉందని అన్నారు.

పిల్లల భవిష్యత్తును కాపాడాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు పరిసర ప్రాంతాల్లో చిన్నపిల్లల్ని ఎత్తుకొని భిక్షాటన చేస్తున్న వారిని ఐసిడిఎస్, పోలీసుశాఖ వారు విచారించి పిల్లల భవిష్యత్తును కాపాడాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కన్వీనర్ సత్తి అచ్చిరెడ్డి కోరారు. చిన్నారులను ఎత్తుకొని బస్సుల వద్ద, ఇతర వాహనాల వద్ద బిక్షమెత్తుకుంటున్న మహిళలు పిల్లలు వారి పిల్లలేనా? ఎక్కడి నుంచైనా ఎత్తుకు వచ్చారా అనే కోణంలో విచారించాలని కోరారు.



డ్రోన్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - బాడంగి

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలో గూడెపు వలస సచివాలయం పరిధిలో కోడూరులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకి వెళ్లి ఈ నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజలు పొందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి బోగి గౌరి, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, తెంటు మధుసూదన, తెంటు నారాయణ రావు, రెడ్డి కృష్ణ, సర్పంచ్ జ్యోతి, ఎంపిటిసి శ్రీదేవి, ట్రైకర్ డైరెక్టర్ చిన్నపు దొర పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో 15నుండి జరగబోయే ఆడుదాం ఆంధ్రా క్రీడలపై అవగాహన కల్పించాలని ఎంపిడిఓ జి.రామా రావు సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పిఇటి, పీడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికితీయడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామాల్లో 15సంవత్సరాలు నిండి ఆసక్తి ఉన్న యువతీ యువకులను కార్యక్రమంలో చేర్పించడానికి అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ జరిపించాలని సూచించారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో వంటి క్రీడలు గ్రామ స్థాయి, నియోజకవర్గం, రాష్ట్ర స్థాయిలో జరుగుతాయని తెలిపారు. నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ఇఓపిఆర్‌డి కె.సింహాద్రి, ఎంఇఒ1 యు. సూర్య నారాయణ మూర్తి, ఎంఇఒ2 ఈపు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ రామారావు

పేదలకు అండగా సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - బొబ్బిలి

పేదలకు అండగా సిఎం సహాయ నిధి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. వైసిపి కార్యాలయంలో గురువారం సిఎం సహాయ నిధి చెక్కును కర్రి లక్ష్మినపన్న కుటుంబ సభ్యులకు అందజేశారు. హైదరాబాద్‌లో కొండెపుడు కొండదేవుల గ్రామానికి చెందిన కర్రి లక్ష్మినపన్న రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యం కోసం సిఎం సహాయ నిధి నుంచి రూ.3.60లక్షలు మంజూరు కావడంతో చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

బాలల మానవ హక్కులను కాపాడాలని జర్మనీ హ్యూమన్ రైట్స్ ప్రతినిధి లిన్నీ కోరారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో హ్యూమన్ రైట్స్ క్లబ్ పని విధానాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు, మానవ హక్కులను కాపాడేందుకు క్లబ్ సభ్యులు పని చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు నివారణకు పని చేయాలన్నారు. బాలలు చదువుకొనే వాలని సూచించారు. బాలలు, మానవ హక్కులను కాపాడేందుకు పని చేస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. హ్యూమన్ రైట్స్ క్లబ్ సక్రమంగా పని చేసేలా విద్యార్థులకు సహకరిస్తున్న హెచ్.ఎం శ్రీనివాసరావును, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే రుణాలు

ప్రజాశక్తి - మెంటాడ

మండలంలోని పిట్టాడ, గుర్ల, జిటిపేట, మెంటాడ, చల్లపేట గ్రామాల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం కర్షకజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లపేట డిసిసిబి బ్రాంచి మేనేజర్ పొందరకి శ్రీనివాసరావు మాట్లాడుతూ అతి తక్కువ వడ్డీకి మహిళా సంఘాలు, గృహ నిర్మాణం కోసం, బంగారు నగలు, చదువు నిమిత్తం రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఇటీవల చల్లపేటలో బ్రాంచి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈనేపథ్యంలో బ్రాంచిలో ఖాతాలు నమోదు చేసుకుని బ్యాంకు అభివృద్ధి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెంటాడ పిఎసిఎస్ సిఇఒ వి.ప్రసాదరావు, సిబ్బంది పతివాడ విశ్వేశ్వరరావు, మహంతి రాంమోహన్, వార్డు మెంబర్ సిరిపురం గోవిందా తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయానికి రూ.10వేలు విరాళం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని గొర్లిపేట పైడి తల్లమ్మ ఆలయానికి నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర రావు 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం ఆయన గొర్లిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని, అనంతరం ఆలయ కమిటీ పెద్దలకు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముంతా ప్రసాద్ రావు, పిన్నింటి వెంకటరమణ, గొర్లె జగన్నాథం, మహంతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మరో మహిళ మృతి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని గవరవీధిలో గత నెల 19న గ్యాస్ సిలిండర్ నుండి వంట గ్యాస్ లీక్ అయ్యి పేలుడు సంభవించిన ఘటనలో ముగ్గురు చిన్నారులతో సహా మరో ఇద్దరు మహిళలు గాయపడి విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న సంఘటన పాఠకులకు విధితమే. ఈ ప్రమాదంలో గాయపడిన తామరాపల్లి వెంకటలక్ష్మి (50) కేజీహెచ్ లో చికిత్స పొందుతూ గత నెల 29 న మృతి చెందిన విషయం కూడా తెలిసిందే. అదే ప్రమాదంలో గాయపడిన మరో మహిళ కెల్ల శ్రావణి (30) కేజీహెచ్ లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. మిగిలిన చిన్నారులు కెల్ల మోహన్ (10), కెల్ల లాస్య (8) , తామరాపల్లి ప్రణవి (7) కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత

విజయనగరం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం 22 కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేశామని ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ సలీమ్ స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ భాస్కరరావు అక్కడకు వెళ్లి తనిఖీ చేయగా సదరు వ్యక్తి పట్టుబడినట్లు సిఐ తెలిపారు.

రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో చిన్నిపాలెం, పంచాయతీ పరిధిలో పంట నష్టం జరిగిన ప్రాంతాలలో ఆయన గురువారం పర్యటించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న నేషనల్ హైవే కోసం దగ్గరలో వున్న చెరువు గట్టును నగం తొలగించివేయడంతో తుపాను సమయంలో ఆ చెరువు నిండి ఉన్న పొలాలు మొత్తం సుమారు 25 ఎకరాలు నీట మునిగిపోయాయని రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకూడదని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలం శెట్టి గోపమ్మ, వేపాడ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, ఉత్తరపల్లి ఎంపిటిసి శివప్రసాద్, వీరభద్రపురం, గేదెల మూర్తి, బీస్ను పవన్, వెంకటరావు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తవలస: పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంట నష్టంపై గురువారం నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను కారణంగా నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో పంటలు పూర్తిగా నీటమునిగాయని ఈ నేపథ్యంలో ధాన్యాన్ని ఎండబెట్టిన తర్వాత అవి ఎలా ఉన్నా రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేసి రైతుకు పంట నష్టాన్ని తగ్గించాల సూచించారు. అందుకు మండలాల వారీగా పంట నష్టానికి సంబంధించి జాబితాను తీసుకొని వ్యవసాయ శాఖ మంత్రిని సంప్రదించి రైతుకు పూర్తి ధర వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. వ్యవసాయ శాఖ ఎడి విజయ మాట్లాడుతూ నియోజకవర్గంలో 42,269 ఎకరాల్లో వరి పంట వేయగా అందులో 1700 ఎకరాలు వరి పంట వర్షాభావ పరిస్థితి వల్ల ఎండిపోగా తుపాను దాటికి 6120 ఎకరాల్లో వరికుప్పలు నీట మునిగాయని అన్నారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చిన్నరామునాయుడు, ఎఎంసి చైర్మన్లు మూకల కస్తూరి, నియోజకవర్గంలోని ఐదు మండలాల జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

శృంగవరపుకోట : తుపాను కారణంగా పంట నష్టపోయిన

పంటలను పరిశీలించిన ఎంపిపి

మండలంలో మిచౌంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాలలో దెబ్బతిన్న పంటలను ఎంపిపి సండి సోమేశ్వరరావు గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, రేవళ్లపాలెం సర్పంచ్ జగన్నాథ కృష్ణమ్మ, ఎస్.కోట జెడ్‌పిటిసి జి.సంతోషికుమారి, నాయకులు రామకృష్ణ, జాగరపు చెల్లంనాయుడు, రాయవరపు వెంకటరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారాన్ని అందించాలని సిపిఎం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం మండలంలోని కొత్తూరు, తిమిడి, వసి గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను సిపిఎం పార్టీ ఎస్‌కోట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. తడిచిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోకపోతే సిపిఎం పార్టీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో రైతన్నలను ఐక్యం చేసి పెద్దఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, సిపిఎం పార్టీ కమిటీ సభ్యులు పివి రమణ, రైతులు ఆవాల రాంబాబు, గంగిరెడ్ల గోవింద, చుక్కా సత్యనారాయణ, నెలివాడ రాము, వాడబోయిన అప్పారావు, వేచలపు దేవుడు, పైడిరాజు, బత్తిన రమణ, రాములమ్మ రమణ, సన్యాసి, సింహాద్రి, ఎర్ర మహేశ్వర రావు, దేముడు, గురువులు, గుమ్మడి గురువులు, కృష్ణ, బోని అప్పారావు, సత్తిబాబు, చుక్కా మంగమ్మ, రాము, సత్యం తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ఎస్‌కోట: నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పూర్తిస్థాయి నష్టపరిహారమివ్వాలి

రామభద్రపురం: మిచౌంగ్ తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టాలు పాలైన రైతాంగానికి పూర్తిస్థాయిలో నష్ట పరిహారాలు మంజూరు చేయాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయభాస్కరరావుతో కలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తుపాను సహాయక చర్యలు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వరి పంట మండలంలో సుమారు 200 ఎకరాలు, కాయగూరలు 200 ఎకరాలు, పత్తి 150 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు తెలియజేశారు. లోతట్టు ప్రాంతాలలో ముందస్తు చర్యలు చేపట్టడంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తుపాను ప్రభావం వల్ల నష్ట పోయిన ప్రతి రైతుకూ న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసి వసంతుల తిరుపతి, నాయకులు చింతల చిన్నమ్మ తల్లి, కనిమెరక వెంకటి, పూడి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటంకాలు తప్పవా?

ప్రజాశక్తి - శృంగవరపుకోట

కొత్తవలస- కిరన్డోల్ (కెకె) లైన్లో తైడ- శివలింగపురం సెక్షన్ల మధ్య విరిగిపడిన కొండ చరియలను వాల్తేర్ డివిజన్ డిఆర్ఎం సౌరవ్ ప్రసాద్ సీనియర్ అధికారులతో కలిసి బుధవారం రాత్రి తొలగించి గూడ్స్ రైళ్ల వెళ్లేందుకు లైన్ క్లియర్ చేసినప్పటికీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు వల్ల ఈ లైన్లో రైళ్ళను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. దీంతో అప్పటికే అరుకు చేరుకున్న కిరండూల్ - విశాఖపట్నం ట్రైన్ నుంచి బుధవారం రాత్రి ప్రయాణికులను ఆర్‌టిసి బస్సులలో విశాఖపట్నం చేర్చారు. ఇది ఎలా ఉండగా గురువారం విశాఖ నుండి కిరండూల్ వెళ్లవలసిన రైలును, కిరండూల్ నుంచి విశాఖ చేరాల్సిన పాసింజర్ రైలును ఈనెల 8వ తేదీ శుక్రవారం వరకు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో అరుకు అందాలను చూసేందుకు ట్రైన్లో వెళ్లే ప్రయాణికులకు నిరాశ తప్పేలా లేదు. ఇది ఎలా ఉండగా మిచౌంగ్ తుపాను కారణంగా ఎస్ కోట నుంచి అరకు వెళ్లే రహదారిలో కూడా పలుచోట్ల చెట్లు, కొండ చర్యలు విరిగిపడ్డాయి. పలుచోట్ల వర్షపు నీరు జలపాతాలను తలపిస్తూ రోడ్లపై ప్రవహిస్తూ ఆటంకంగా మారింది.

నేడు మెగా జాబ్ మేళా

బొబ్బిలి: స్థానిక విద్వాన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ శంబంగి శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరుగుతుందన్నారు. జాబ్ మేళాకు 13 కంపెనీలు నుంచి ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేస్తారని, పది, ఇంటర్, డిప్లమో, ఐటిఐ, డిగ్రీ, బిఫార్మసీ, బిటెక్ పూర్తి చేసి 18 నుంచి 35ఏళ్ల లోపు నిరుద్యోగ యువత హాజరు కావాలన్నారు. జాబ్ మేళాలో 1200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు.

రైతులను ఆదుకోవాలి

వేపాడ : తుపాను కారణంగా మండలంలో బానాది, ఎం. సింగవరం, ఎస్ఎస్ఆర్ పురం, పీకేఆర్‌పురం, వల్లంపూడి, వేపాడ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో పంట నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ వర్షాలకు పెసర, మినుము రైతులు కూడా నష్టపోయారని వారినీ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కాగా పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ. 30వేలు చెల్లించాలని రైతు సంఘం నాయకులు చల్లా జగన్ మరో ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డుపై కూరుకుపోయిన లారీ

స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి-తెర్లాం రోడ్డు అద్వాన్నంగా మారింది. గొల్లపల్లి సమీపంలో పిరిడి జంక్షన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతిలో గురువారం లారీ కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలను రామభద్రపురం నుంచి బాడంగి, తెర్లాం మండలాలు మీదుగా మళ్లించారు. భారీ వాహనాలు రాకపోకలు చేయడంతో పినపెంకి నుంచి బొబ్బిలి వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులలో వరదనీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిరిడి జంక్షన్ సమీపంలో గోతిలో లారీ కూరుకుపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లు బాగు చేయాలని, పారాది నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మధ్యలో కూరుకుపోయిన భారీ లారీ

వైసిపిని సాగనంపేందుకు ప్రజలంతా సిద్ధం

ప్రజాశక్తి - భోగాపురం

వైసిపి ప్రభుత్వాన్నిసాగనంపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టోపై బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని తూడేం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి భవిష్యత్ గ్యారెంటీ బాండ్లు పంపిణి చేశారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జి దాసరి అప్పలస్వామి, పార్లమెంట్ తెలుగుయువత కార్యనిర్వహణ కార్యదర్శి కర్రోతు రాజు, యూనిట్ ఇంచార్జి కొండపు ఈశ్వరరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు రీసు రమణ, టిడిపి నాయకులు పూడి రమణ, బూత్ ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని శ్రీనివాస కాలనీలో టిడిపి మండల అధ్యక్షుడు జిఎస్.నాయుడు ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్ గుడుపు బ్రహ్మాజీ, పెదగాడ లక్ష్మి, యూనిట్ ఇంచార్జ్ సరిపల్లి రామకృష్ణ సారథ్యంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేస్తూ కరపత్రాలను పంపణీ చేశారు. అనంతరం ప్రజలకు మినీ మేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ అండ్ విశాఖ టిడిపి పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, వార్డు మెంబెర్ గుడుపు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

సాగులోనే ఉన్నాం.. పట్టాలిప్పించండి

●పెదమేడపల్లిలో దళితుల ఆర్తనాదాలు ● ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు ● ఈ నెల 25 లోపు పట్టాలు ఇవ్వకపోతే చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 402/1, 402/2గల కొండ పోరంబోకు భూమిని మాదిగ కులానికి చెందిన దళితులు సుమారు 120 కుటుంబాలు గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన అగ్రకులాలు వీరిని భయభ్రాంతులకు గురిచేస్తూ సాగు ఆటంకానికి గొడవలు రేపుతున్నారు. ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని జిల్లా స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ గ్రామ నాయకులు మండల స్థాయి నుండి దిగువ స్థాయి అధికారులు తమకు ఆటంకాలు కల్పిస్తూ పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు వడ్డీ జనార్దన్ రావు అన్నారు. గురువారం సదరు స్థలంలో ఒక్కొక్కరికి 18 సెంట్లు చొప్పున కేటాయించుకొని సాగు చేస్తున్న భూమిలో గట్లు వేస్తూ సదును చేసుకున్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళగా కొండ పోరంబోకు భూమిని చదును చేసుకుని వివిధ రకాల మొక్కలు నాటుకుని అనుభవిస్తున్నామని తాము దళితులమనే చిన్న చూపుతో ఎంతమంది మండల స్థాయి అధికారులు మారినప్పటికీ తమకు పట్టాలు ఇవ్వటానికి ఎందుకు సముకుతం చూపించడం లేదో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25వ తేదీ లోపు అధికారులు స్పందించి పట్టాలు ఇవ్వకపోతే ఇదే గ్రామం నుండి దళిత కుటుంబాలు అన్ని విజయనగరం గ్రీవెన్స్‌కు పాదయాత్రగా బయలుదేరి పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి వడ్డీ చిన్నారావు, సున్నపు ప్రసాద్, వడ్డీ లక్ష్మణరావు, వడ్డీ అప్పలనాయుడు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గట్లను ఏర్పాటు చేసుకుంటున్న దళిత రైతులు

స్థానికులకు ఉపాధి కల్పించేది ఎస్ఎంఎస్ పరిశ్రమే

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఈ ప్రాంతంలో సిఎస్ఆర్ ఆక్టివీస్ క్రింద అత్యదికంగా ఖర్చుచేస్తుంది ఎస్ఎంఎస్ పరిశ్రమేనని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. గురువారం మండలంలోని కుమిలి ద్వాదశి దేవాలయం వద్ద ఎస్ఎంఎస్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులలో భాగంగా రూ. 1.50 కోట్లతో కమ్యూనిటి భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఎంఎస్ పరిశ్రమ యజమాని పొట్లూరి రమేష్‌బాబు మండలంలోని పూసపాటిరేగ, కొప్పెర్ల గురుకులంలో పాఠశాల భవనాలు నిర్మాణానికి కోట్ల రూపాయలు ఆర్థిక సహాకారం అందించిన సంగతి తెలిసిందే అన్నారు. కుమిలిలో పురాతన దేవాలయం ఆనుకొని కళ్యాణ మండపం నిర్మాణం చేయాలని ఆయన్ను కోరానన్నారు. సిఎస్ఆర్ ఆక్టివిటీస్‌లో కళ్యాణమండపం ఇవ్వలేమని, కమ్యూనిటీ భవనం నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారని చెప్పినట్లే కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. దేవాలయాన్ని ఆనుకొని ఉన్న ఈ నిర్మాణంలో ఎంతో మంది పేదలు పెళ్లిలు జరిపించుకోవచ్చన్నారు. ఈ గ్రామానికి చుట్టు పక్కలు వందల గ్రామాలు ఉన్నాయన్నారు. వీరందరికి ఇది ఎంతో ఉపయోగం అన్నారు. సంస్థ నష్టాల్లో ఉన్నప్పటికీ సామాజిక భాద్యతగా వ్యవహరించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి ఎన్. సత్యనారాయణరాజు, అల్లాడ సత్యనారాయణమూర్తి, సర్పంచి కొత్తకోట శ్రీరాములు, గ్రామ సర్పంచి మామిడి అప్పయ్యమ్మ, ఉప సర్పంచి గుజ్జు సరేష్‌రెడ్డి, గాబు సూరప్పన్న రెడ్డి, రాజారెడ్డి, దేవాదాయ శాఖ ఇఒతో పాటు ఎస్ఎంఎస్ పరిశ్రమ ప్రతినిధులు కరుణకుమార్, గోపాలకృష్ణ, రంగారావు, శంకర్, సూరిబాబు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

రాజుకు సత్కారం

బొబ్బిలి: ఇటీవల విజయవాడలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డ్ అందుకున్న కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు జెసి రాజును పట్టణానికి చెందిన హుదా ముస్లిం వెల్ఫేర్ సంస్థ ఘనంగా సత్కరించింది. గురువారం ఆ సంస్థ అధ్యక్షులు రఫీ నిర్వహణలో ప్రతినిధులు జాఫర్, బాబ్జి, హాజి, విజయనగరం జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షు హమీద్‌లు జెసి రాజు స్వగృహంలో పట్టు కండువాతో జ్ఞాపికను అందించి సత్కరించి అభినందనలు తెలిపారు. భారత దేశానికి స్ఫూర్తి నిచ్చిన డాక్టర్ అబ్దుల్ కలాం పేరుమీదుగా ఎక్సలెన్సీ అవార్డ్‌ను అందుకోవడం గొప్ప విషయమన్నారు.

రాజును సత్కరిస్తున్న హుడా ప్రతినిధులు

IN THE HONOURABLE COURT OF THE IInd ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM IInd ADDITIONAL JUDICIAL 1ST CLASS MAGISTRATE AT VIZIANAGARAM

I.A. No.633/2023 in I.A. No. 175/2023 O.S. 173/2023

Between :-
Lenka Parvathi ......Plaintiff
And
1.Smt.Sankrana Papayyamma & 14 others
To

Defendants 3 to 6

1.Sankrana Sanyasamma W/o late Appalanaidu, Daughter in law of late Krishna, aged 67 years, House hold duties, Rajaveedhi, Gajulrega Vizianagaram .
2. Sankrana Ramakrsihna S/o late Appalanaidu, Grand Son of Sankrana late Krishna, aged 59 years, Hindu, business, cultivation, Rest -do-
3. Sankrana Srinavasa Rao S/o late Appalanaidu Grand Son of Sankrana late Krishna, Aged 47 years, Hindu, business, and Cultivation, Rest -do-
4. Smt. Burle Appalanaryana W/o Sominaidu D/o Appalanaidu Grand daughter of late Krishna C/o Sankrana Ramakrishna, aged 45 years, Golagam Village, Bhogapuram Mandalam. Viziangaram District.
.....Defendants / Respondents

Summon Notice

పై నెంబరు దావా లో వాది (Plaintiff) ప్రతివాదులు (defendants) పై కోర్టు నందు injunction, దావా వేసియున్నారు. సదరు దావాలో పైన ఉదాహరించిన 3 నుంచి 6 ప్రతివాదులు కోర్టు వారు పంపిన దావా Summonలు injunciton petition I.A.No.175/2023 Noticeనందు అందుకోనందున పైన I.A. No. 633/2023లో ఆర్డర్ ప్రకారము 3 నుంచి 6 వరకు ఉన్న ప్రతివాదులు (defendants)కి పత్రికా మూలముగా మహారాజశ్రీ కోర్టువారు దావా Summons మరియు I.A.175/2023 నోటీసులు జారీ చేసియున్నారు 'పై ఆర్డర్ ప్రకారము ప్రతివాదులు స్వయముగా గాని, న్యాయవాదిగారి ద్వారా గాని **తే 20-12-2023 ఉదయము గం॥10-30ని॥** మహారాజశ్రీ కోర్టు నందు హాజరు అయ్యి వారి అభ్యంతరములను తెలుపుకోవచ్చును

Sri Pantula Janaki Rama Joga Rao
Advocate for Plaintiff
Law Chambers, D.No. 18-5-1, Potturuvari Street, VIZIANAGARAM-535002, Cell: 94407 54396

అభివృద్ధి పనులు వేగవంతం

డెంకాడ: మాట్లాడుతున్న ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు

ప్రజాశక్తి - డెంకాడ

కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరై చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు కోరారు. గురువారం మండలంలోని చొల్లంగిపేట, డి.కొల్లాం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 18 వరకూ ఈ కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ అధికారులతో అభివృద్ధి పనులపై సమన్వయం చేసుకుని పనులను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిప పిన్నింటి తమ్మినాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, ఎపిఎం విజయలక్ష్మి, ఎపిఒ వెంకటరమణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మీసాల శివరామకృష్ణ, సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపిటిసి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

వేపాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పై ఈ నెల 8 నుంచి 13 వరకూ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరిట ప్రచారం చేస్తామని ఎంపిడిఒ పట్నాయక్ తెలిపారు. 8న వేపాడ, వల్లంపూడి,9న వీలుపరితి, వావిలపాడు, 10న నల్లబెల్లి, ఎన్‌కెఆర్‌పురం, 11న బల్లంకి, బానాది, 12న కుంపల్లి, కెఆర్ పేట, 13న డిఆర్ పేట, ఏఎస్‌పేట సచివాలయాల వద్ద సభలు పెడతామన్నారు. వాహనంపై డిజిటల్ స్క్రీన్ అమర్చి ప్రతి గ్రామంలోనూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గూర్చి వివరిస్తామన్నారు.

VIZIANAGARAM MUNICIPAL CORPORATION

e-Proc.Short NIT No.456/17/E/TO/2023-24, Dt.06-12-2023

Providing Drinking Water Supply distribution Pipe Lines, Roads, Drains, Toilets, Compound walls, Grills, etc., under 15th Fc, GGMP & General Funds.

Approx. No.of works & Est.cost	31 Works Rs.381.98 Lakhs.	30 Works Rs.221.16 Lakhs.	30± Works Rs.350 ± Lakhs.	Time
Download start date & time	08-12-2023	12-12-2023	20-12-2023	from 3.30 P.M.
Download end date & time	16-12-2023	20-12-2023	28-12-2023	upto 3.30 P.M.
Bid Submission Closing Date&Time	16-12-2023	20-12-2023	28-12-2023	upto 4.00 P.M.
Bid opening date & time	16-12-2023	20-12-2023	28-12-2023	after 4.30 P.M.

Contact Nos.9849906481, 9849908296. Further details can be seen at www.apeprocurement.gov.in.

COMMISSIONER